క్లుప్తంగా

గ్రానైట్ బండపై అంబేడ్కర్ ప్రతిమ



ప్రతిమను చూపుతున్న పి.మల్లికార్జున



గ్రానైట్ బండపై మలిచిన అంబేడ్కర్ చిత్రం

ఆదోని రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదోని పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, కమ్మరచేడు జెడ్పీ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ సి.మల్లికార్జున గ్రానైట్ బండపై అంబేడ్కర్ ప్రతిమను మలిచాడు. గతంలో చాక్ పీస్‌పై శివుడి ప్రతిమ, తదితర ప్రతిమలు మలిచి అందరి మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చెక్కిన చిత్రాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుండడం సంతోషంగా ఉందన్నారు.

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించే గోశాల సంరక్షణ కోసం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఆద్వితా లక్ష రూపాయాలను విరాళంగా అందజేశారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.వీరికి శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



మఠ్రిస్వామి దంపతుల ఊరేగింపు

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వెలసిన కృష్ణావధూత స్వామి ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున కృష్ణవధూత విగ్రహానికి ప్రత్యేక పూజలు, సుప్రభాతసేవ, మంగళహారతి, ఆర్ల బండ మఠం మఠాధిపతి మఠ్రిస్వామి తాత ప్రత్యేక పూజలు చేసిన తర్వాత భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆరాధనోత్సవాల్లో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలేకాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మఠం నందు నూతనంగా నిర్మించిన మండపాన్ని స్వామి ప్రారంభించారు. అనంతరం మఠ్రిస్వామి, రత్నమ్మ దంపతుల పల్లకీ మహోత్సవం వైభవంగా జరిగింది. మహిళలు కలశాలతో తరలిరాగా పల్లకి రథం ముందు కుసాగింది. యువకుల కోలాటలు, చిన్నారుల నృత్య విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నేడు గ్రామ సభ

కౌతాళం: మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ వార్షిక ప్రణాళికపై గ్రామ సభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ పాల్‌దినకరన్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. పంచాయతీకి సంబంధించి వార్షిక ప్రణాళికను రూపొందించి చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ సమావేశం కొనసాగుతుందని తెలిపారు. అలాగే గత వార్షిక లెక్కలు, అడిట్ నివేదిక, పరిపాలన నివేదికతో పాటు గ్రామంలోని శానిటేషన్, నీటి సమస్యపై చర్చించనున్నట్లు తెలిపారు.

35 మందికి పొజిషన్ పట్టాలు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వగరూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి ఆధ్వర్యంలో 35 మందికి పొజిషన్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చిన వారికి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి:మండలకేంద్రంలోని కడపాళెం 3వవార్డులో వలస వెళ్లిన కుటుంబాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను ఎంపీపీ ఈరన్న తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులకు విద్యాబోధన, భోజన విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వేళల్లో ఉదయం రాత్రి, సెలవు దినాల్లో మధ్యాహ్నం కూడా భోజనం వడ్డిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. చదువులో వెనుకబడినవారిని గుర్తించి మెరుగైన బోధనతో ముందుకు తీసుకెళ్లాలని ట్యూటర్‌కు సూచించారు.

ఉద్యోగాలకు ఎంపిక

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 36 మంది డిప్లొమా విద్యార్థులు ఉద్యోగానికి ఎంపికైయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు 24 మంది, ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు ఆరుగురు, ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం విద్యార్థులు ఆరుగురు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులకు నెలకు రూ.17 వేలు జీతాన్ని కంపెనీ అందిస్తుందన్నారు.

అగ్గితో జరభద్రం

- వేసవిలో ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష
- క్లస్టర్ పరిధిలో ఏడాదిగా 101 అగ్నిప్రమాదాలు
- వంట గ్యాస్‌పై నిర్లక్ష్యం వహిస్తే అనర్థమే
- నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు

ఆదోని అర్బన్: కట్టెల పొయ్యికి కాలం చెల్లింది. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా గ్యాస్‌స్టవ్ దర్శనమిస్తోంది. వీటి వినియోగంపై అవగాహన లేక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగరెట్, చుట్ట, బీడీ ఆర్పివేయకుండా పడేయడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరిత్యాలతో జరిగే అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తగిన జాగ్రత్తలతో వీటిని అరికట్టవచ్చని, ప్రమాదం జరిగితే నష్టాన్ని నివారించవచ్చని చెబుతున్నారు. డివిజన్ పరిధిలో గతేడాది నుంచి ప్రస్తుత మార్చి 31వ తేదీ వరకు 101 అగ్ని ప్రమా దాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో రూ.47,55,000 నష్టం సంభవించగా, రూ.2,15,28,000 విలువైన ఆస్తిని కాపాడిగలిగినట్లు ఫైర్‌స్టేషన్ అధికారులు వివరించారు. ఇందులో షార్ట్ సర్క్యూట్ వల్ల 28, దీపాల వల్ల 2, పొయ్యి వల్ల 1, గ్యాస్ ద్వారా 2, నిర్లక్ష్యంగా పొగతాగడం ద్వారా 66, పాతకక్షల వల్ల 1, ఇంట్లో వివిధ రకాల ప్రమాదాలు 15, స్టోరేజ్‌లో 7, ఫ్యాక్టరీలో 5, ఎలక్ట్రిసిటీ బోర్డులో 1, దుకాణంలో 4, ఫారెస్టులో 6,గడ్డివాములు 58ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.ప్రమాదాలుసంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే వీలుంటుంది. 1944 ఏప్రిల్ 14న బొంబాయి ఓడరేవులో ఆయుధాలు, గన్‌పౌడర్ కలిగిన నౌకలో అగ్ని ప్రమాదం సంభవించి అనేక నౌకలు, బిల్డింగ్‌లకు మంటలు వ్యాపించాయి. ఇందులో 336 మంది ప్రజలు, 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతిచెందారు. వారి సంస్మరణార్థం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుపుకుంటున్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు

- వంటగ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి.
- బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వంటివి వేయకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బదికి సమాచారం ఇవ్వాలి.
- సిగరెట్, చుట్ట, బీడీ వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పివేయాలి.
- ఇళ్లను వదిలి వెళ్లేవారు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.దీంతో వేడికి షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది.
- వంటచేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గిపెట్టెలు, లైటర్‌లు, దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.

వంటగ్యాస్‌తో అప్రమత్తంగా ఉండాలి

- సిలిండర్‌ను ఎప్పుడూ నిలువుగానే ఉంచాలి. పడుకోబెట్టడం వంటివి చేయరాదు.
- సిలిండర్ కంటే స్టవ్ ఎత్తులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- అనుమానం వచ్చినప్పుడు సిలిండర్‌పై కొన్ని నీళ్లు చల్లితే బుడగలు వచ్చి గ్యాస్ లీకయ్యే విషయం తెలుస్తుంది.



ఎంపీడీఓ గీతావాణికి అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని వివరిస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

ప్రమాదాలు తగ్గిస్తున్నాం



అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్యాస్ లీకైనప్పుడు మంటలను ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాం. ప్రమాదాల నుంచి కాపాడుకునే మెలకువలు నేర్పిస్తున్నాం. దీంతో ప్రమాదాలను చాలా వరకు తగ్గిస్తున్నాం. ఈ ఏడాది అగ్నిప్రమాదాల్లో రూ.2.15 కోట్ల విలువైన ఆస్తులను కాపాడాం. ప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.

– యేసురత్నం, అగ్నిమాపక అధికారి

అక్రమ లేఅవుట్లపై విచారణ

ఆదోని రూరల్: పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా వేసిన లేఅవుట్లను వెంటనే తొలగించాలని ఆదోని డివిజనల్ లెవెల్ పంచాయతీ రాజ్ ఆఫీసర్ (డీఎల్‌పీఓ) నూర్జహాన్ ఆదేశించారు. మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో కొందరు అక్రమార్కులు అనధికారికంగా లేఅవుట్లు వేసి అమ్ముకుంటున్న విషయంపై స్పందనలో సబ్ కలెక్టర్ దృష్టికి రావడంతో గురువారం తనను విచారణకు ఆదేశించినట్లు ఆమె తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు డీఎల్‌పీఓ చెప్పారు. పెద్దతుంబళం పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 304లో అనధికారికంగా వేసిన లేఅవుట్ ప్లాట్లను అమ్మడం గానీ, కొనడం గానీ చేయరాదని, భవిష్యత్‌లో వీటి రిజిస్ట్రేషన్లు జరగవని తేల్చిచెప్పారు. లేఅవుట్ వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ ఉచ్చప్ప, సచివాలయ సెక్రటరీ లక్ష్మి తదితరులు ఉన్నారు.



పెద్దతుంబళంలో అక్రమ లేఅవుట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

47వేల ఎకరాలకు సాగునీరందించాం



రైతులతో మాట్లాడుతున్న ఈఈ శైలేశ్వర్

ఎమ్మిగనూరు: తుంగభద్ర దిగువ కాలువ ద్వారా రబీలో 47 వేల ఎకరాలకు సాగునీరందించామని ఆదోని డివిజన్ ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ తెలిపారు. గురువారం ఎల్లెల్సీ ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌ను సందర్శించి వేసవిలో ఎల్లెల్సీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిందిస్థాయి నుంచి ఎల్లెల్సీ సిబ్బంది పర్యవేక్షణ, ఉన్నత స్థాయిలో ఈఈ శేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ, రైతుల సహకారం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. హగరిపై ఎల్లెల్సీ కాలువ పిల్లర్లు కొట్టుకుపోయినప్పుడు పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టడటం సంతృప్తినిచ్చిందన్నారు. హగరిపై ఎల్లెల్సీ కాలువను పటిష్టం చేసేందుకు రూ.40కోట్లతో పనులు చేపడుతున్నారని, వేసవిలో ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టుల పటిష్టత, మరమ్మతులకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు కూడా సాగునీటి తీరువా (శిస్తు) చెల్లించి ఎల్లెల్సీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీఈ లక్ష్మణ్ కుమార్, ఏఈలు రామాంజినేయులు, రవి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు జీవం పోశారు

ఎంఎల్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఎండుతున్న పంటలకు జీవం పోసి ఆదుకున్నారని, అందుకు రైతులంతా రుణపడి ఉన్నామంటూ అలువాల, పెద్దమరివీడు రైతులు ఈఈ శైలేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లెల్సీకి గండి పడినప్పుడు పంటలు ఎండిపోతుంటే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీరందించారని, దీంతో మిరప, పత్తి దిగుబడులు బాగా వచ్చాయని పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డి, రాముడు నేతృత్వంలో 30 మంది రైతులు ఈఈ, డీఈ, ఏఈలను పూలమాల వేసి దుశ్శాలువాలతో సత్కరించారు.

జనం మెచ్చిన నేత జగనన్న

- పాండవగల్‌లో మూడో రోజు 'జీజీఎంపీ'లో పాల్గొన్న ఎమ్మెల్యే
- 280కి పైగా గడపల సందర్శన

ఆదోని రూరల్: జనం మెచ్చిన నేత జగనన్న అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ మేరకు పాండవగల్ గ్రామంలో గురువారం మూడో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే 280కు పైగా గడపలను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదోని ప్రజలకు అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో పథకాలు అందాలంటే ఆ పార్టీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని వివరించారు. అన్నివర్గాలకు మంచి చేస్తున్న సీఎం జగనన్నను చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఓర్చుకోలేకపోతున్నారని ఆరోపించారు. వారు ఎన్ని సమావేశాలు పెట్టినా ప్రజలకు ఏమి చేస్తారో చెప్పరని, కేవలం జగనన్నను విమర్శించడమే వారి పని అని ఎద్దేవా చేశారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటారని తెలిపారు. మూడున్నరేళ్ల పాలనలోనే ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి చేశారని వివరించారు. ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఈఓపీఆర్‌డీ జనార్ధన్, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఆర్ఐ జయరామిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, నాయకులు మంజుల, రేణుక, గురునాథ్‌రెడ్డి, కామాక్షి తిమ్మప్ప, మల్లారెడ్డి, లక్ష్మి, ఉచ్చీరప్ప, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

నేల ఆరోగ్యానికి మట్టి పరీక్షలు



మట్టి శ్యాంపిల్ సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కోసిగి: నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి రైతు మట్టి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి రాజు సూచించారు. మండల పరిధిలోని దుద్ది గ్రామంలో గురువారం మట్టి పరీక్షలకు నమూనాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలోని 17 ఆర్బీకే కేంద్రాల నుంచి ప్రతిరోజు వ్యవసాయాధికారులు, రైతులు గ్రామాలు తిరిగి మట్టి నమూనాలు సేకరించాలన్నారు. ఈ నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. భూసారవంతాన్ని బట్టి రాబోయే ఖరీఫ్‌లో పంటలను సాగుచేసుకోవాల్సి ఉంటుందని రైతులకు సూచించారు. భూ పరీక్షల ఫలితాల ఆధారంగా భూసారాన్ని పెంచేందుకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కౌతాళం: వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పొలాలలో సాగు చేసుకునేందుకు అనువైన పంటలను గుర్తించేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ శేషాద్రి సూచించారు. కౌతాళం ఆర్బీకే-1లో గురువారం వీపీఏలకు భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. ఏఓ మాట్లాడుతూ.. భూసార పరీక్షల వల్ల తమ పొలం ఏ పంటకు అనువైనది, ఎలాంటి ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. పొలంలోని కొంత మట్టిని ఆర్బీకేకు తెచ్చి వీపీఏల సమక్షంలో భూసార పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. అనంతరం వీపీఏలకు భూసార పరీక్షల గురించి పొలాలకు వెళ్లి శిక్షణ ఇచ్చారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు జనాదరణ



కోసిగిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మిరప రైతుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ అమరేష్ అన్నారు. గురువారం అగసలదిన్నె, లింగాలదిన్నె గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కొంతరు రైతులు పొలాల్లో మిరప పంట గ్రేడింగ్‌లో ఉండగా అక్కడికే వెళ్లి వారికి పథకాల గురించి వివరించారు. కుంబళనూరు క్యాంపులో సీనియర్ నాయకులు శేషారావు, అనిల్‌కుమార్, బదినేహాల్‌లో ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, కౌతాళంలో మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అతికించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు చౌదరిబసవ, ఉమపతి, సమద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జోరుగా సాగుతోంది. మండల కేంద్రంలోని స్టాఫ్‌క్వాటర్స్, రాఘవేంద్ర నగర్‌లో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, కాచాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ స్టికర్లు అతికించారు.

కోసిగి: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం అవుతుందని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. గురువారం కోసిగి సచివాలయం- 2 పరిధిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని తెలుసుకున్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. ప్రజల మద్దతుతో 8296082960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కెనాల్‌లో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఎల్లెల్సీ కెనాల్, ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. తుంగభద్ర జలాశయం నుంచి సాగు, తాగునీరు నిమిత్తం రా వాటర్ పంపింగ్ జరిగేది. అయితే 10వ తేదీన నీటి విడుదల నిలిపివేశారు. దీంతో కెనాల్‌లో నీటి నిల్వను పెంచుకునేందుకు గానూ క్రాస్ బండను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. క్రాస్ బండ ద్వారా కెనాల్‌లో నిల్వ ఉన్న నీరు దాదాపు 10 రోజులకు సరిపడతాయన్నారు. ఎస్ఎస్ ట్యాంకులో రెండు నెలలకు సరిపడే నీరు నిల్వ ఉన్నాయని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహం పరిసరాలు పరిశుభ్రం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పాత బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం, పరిసరాలను గురువారం శుభ్రం చేసే పనులను కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు. అలాగే 27, 28, 29 వార్డు సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల హాజరుపట్టిక, గైర్హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని సూచించారు.

పీపుల్స్ సర్వేకు అనూహ్య స్పందన



ఆదోని 4వ వార్డులో ఇంటి వద్ద ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

ఆదోని టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే (జగనన్నే మా భవిష్యత్) కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. నాయకులు ఏ గ్రామానికి, పట్టణంలో ఏ వీధికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గడప గడపకు వెళ్లిన గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పండగ వాతావరణం కనిపిస్తోంది. కేవలం ఆరు రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయి. 40 లక్షల మంది మిస్డ్‌కాల్స్ చేసి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు చలపతి, ఉమామహేశ్వరిఆనంద్, తాయన్న, సురేష్ అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న- మా భవిష్యత్ నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా గురువారం 2, 4, 18, 19, 28 వార్డుల్లో ఇంటింటికీ తిరిగారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారు మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త రికార్డును సృష్టించిందన్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలియజేస్తున్నారు. ప్రజా మద్దతుతో 2024లో జగనన్నే సీఎం కావడం తథ్యమన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న పోలీసులు

కౌతాళం: మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగేంద్ర కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని నదిచాగి, మేళిగనూరు గ్రామాల మధ్య తుంగభద్ర నదికి వెళ్లే రస్తాలో గురువారం కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. కోసిగి గ్రామానికి చెందిన మహబుబ్‌బాషా, అలీ ద్విచక్ర వాహనంపై 10 బాక్సుల కర్ణాటక ఒరిజినల్ చాయిస్ మద్యం బాక్సులను తీసుకొస్తుండగా సిబ్బందితో కలిసి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. మద్యం బాక్సులతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో అలీ పరారుకాగా మహబుబ్‌బాషాను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహల్లి గ్రామానికి చెందిన బోయ సోమశంకర్ తన ఇంటి వద్ద గురువారం అక్రమంగా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను అమ్ముతుండగా ఇస్వి హెడ్ కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 23 ఓసీ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.


సర్వర్ పనిచేయడం లేదంటూ బ్యాంకుకు తాళం



బ్యాంకు గేటు మూసివేయడంతో బయట వేచి ఉన్న ఖాతాదారులు

కోసిగి: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో గురువారం సర్వర్ పనిచేయడం లేదంటూ మేనేజర్ అనిల్‌కుమార్ ఖాతాదారులను బయటకు పంపి గేటు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ లావాదేవీ పనులు, కొత్త అకౌంట్ ప్రారంభించేందుకు గురువారం వందలాది మంది బ్యాంకుకు చేరుకున్నారు. అయితే సర్వర్ పనిచేయడం లేదంటూ మేనేజర్ అందరినీ బయటికి పంపి గేట్లు వేశాడు. దీంతో వారు గంటల కొద్ది వేచి ఉండలేక అవస్థలు పడ్డారు. మండువేసవిలో కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన వాత్సల్య పథకానికి అర్హులైన వారు బ్యాంకు అకౌంట్ చేసుకోవాల్సి ఉంది. పథకం గడువు దగ్గర పడుతున్న సమయంలో బ్యాంకు సర్వర్ మొరాయించడం తదితర సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోయారు.

సద్వినియోగం చేసుకోండి



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ఆదోని అర్బన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళా సమృద్ధి సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం మహిళలకు సువర్ణావకాశమని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆదోని హెడ్ పోస్టాఫీసును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమృద్ధి పథకం పథకంలో వయస్సుతో నిమిత్తం లేకుండా మైనర్‌తో పాటు పెద్దలు కూడా అర్హులన్నారు. రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేస్తే ఏడున్నర శాతం వడ్డీతో రెండేళ్ల తర్వాత మొత్తం డబ్బు పొందవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో 30 వేల అకౌంట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ నరసింహులు,పోస్టుమాస్టర్ సురేంద్ర, సిబ్బందిరాగప్ప, యువరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని బుగ్గతండా సమీపంలో నాటుసారా స్థావరాలపై తనిఖీ నిర్వహించేందుకు వెళ్లిన సెబ్ సిబ్బందిపై దాడులకు పాల్పడిన నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. తెల్లవారుజామున విజయవాడకు చెందిన సెబ్ స్పెషల్ టీం ఎస్ఐ ఓబులేసు సిబ్బందితో కలిసి కొండప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రం వద్దకు వెళ్లగా తండావాసులు రంగానాయక్, కృష్ణానాయక్, జాప్లా, రవి, రంగా, నెట్టికంఠయ్య, శ్రీరామనాయక్‌లు చుట్టుముట్టి దాడికి తెగబడ్డారన్నారు. ఘటనలో బుధవారం ముగ్గురిని అరెస్టు చేయగా పరారీలో ఉన్న మిగతా నలుగురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.